


బజ్జర్ శబ్దం విన్పించేసరికి చైతన్య వెళ్ళి తలుపు తీశాడు

ఎదురుగా హ్యాండ్‌బ్యాగ్ ఊపుతూ సౌందర్య కన్పించింది

చైతన్య మౌనంగా వెనక్కి తిరిగాడు

సౌందర్య మెల్లగా అతని వెనుకే నాల్గడుగులు వేసింది

ఏమండి! బాబు ఏం చేస్తున్నాడు? పాలు పట్టారా? అని ప్రశ్నించింది అలానడుస్తూనే

చైతన్య సమాధానం చెప్పకుండా మెల్లగా వెళ్ళి సోఫాలో కూర్చున్నాడు

త్వరగా వచ్చేద్దామనుకొన్నాను కాని మా జాయింట్ సెక్రటరి బర్త్‌డే పార్టీ యిచ్చింది అందుకే ఈ ఆలస్యం సారి!

చైతన్య పెదవి విప్పలేదు

సౌందర్య కోపంగా హ్యాండ్ బ్యాగును టీపాయ్ మీదికి విసిరింది

ఏమిటండి మాట్లాడరు? ఒంట్లో బాగా లేదా?

లేదు!

బాబెక్కడున్నాడు?

బెడ్ రూమ్‌లో

గబగబ లోపలికి వెళ్ళింది సౌందర్య

ఇంకో పరిస్థితిలో అయితే చైతన్య ఉత్సాహంగా అడుగులు వేస్తూ ఆమెను అనుసరించి వుండేవాడు కాని సూర్యం చెప్పిన సలహా అతని మనసులో ఇంకా మెదుల్తూనే వుంది

అతివలతో అతి తక్కువగా మాట్లాడాలి!

వంటయింది రండి! అని సౌందర్య వచ్చి పిల్చే వరకు చైతన్య అలానే సోఫాలో కూర్చునివున్నాడు

పది నిమిషాల్లో భోజనం ముగించుకొని వరండాలోకి వచ్చాడు

ఈ రోజు సెకండ్ షోకు వెళ్దామండి! అంది సౌందర్య గుమ్మం దగ్గర నిలబడి

నాకు తల నొప్పిగా వుంది!

అదేమిటండి? ఇందాకట్నుంచి గమనిస్తున్నాను ఈరోజు మీరు అదోలా వున్నారేమిటి? అని అడిగింది

ఒంట్లో బాగా లేదని చెప్పానుగా!

ఏవైనా టాబ్లెట్స్ వేసుకోండి!

వేసుకొన్నాను!

ఈ రోజు ఫ్రెండ్స్ అందర్ని సెకండ్ షోకి తీసుకువెళ్తానని మాటిచ్చాను మిమ్మల్ని వాళ్ళందరికీ పరిచయం చేస్తానని ప్రామిస్ కూడా చేశాను మీరెలాగైనా రావాలి!

సారి! నేను రాలేను!

మీరు రాకపోతే నా పరువు పోతుంది!

ఐ కాంట్ హెల్ప్

టిక్కెట్స్ కూడా రిజర్వ్ చేయించాను మీకు జ్వరం లేదుగా! కాస్త టీ త్రాగితే ఫ్రెష్‌గా వుంటుందండి ప్లీజ్ రండి!

నో

అంతేనా?

# ఈ సలహాలు మీకోసమే!

గుడిసేవ సుందరరామయ్య

యస్!

మీరు వచ్చినా రాక పోయినా ఐ మస్ట్ గో అంటూ విసురుగా లోపలికి వెళ్ళింది

మరో పావుగంటకు చక్కగా టాయిలెట్ అయి చైతన్య దగ్గరకు వచ్చింది

నేను వెళ్తున్నాను బాబు లేస్తే ఫ్లాస్కులో పాలున్నాయి పట్టండి! అంటూ చెప్పుల చప్పుడు చేసుకొంటూ బయటకు వెళ్ళింది సౌందర్య

చైతన్య అలా కొన్ని క్షణాలపాటు చూస్తూండి పోయాడు

తలుపు గడియ వేసి బెడ్ రూమ్‌లోకి వచ్చాడు

మంచమ్మీద బాబు నిద్రపోతున్నాడు

కొడుకు ప్రక్కనే నడుం వాల్చాడు

పైన తిరుగుతున్న సీలింగ్ ఫాన్ వైపు చూస్తూ ఆలోచించసాగాడు

సాయంత్రం లాన్‌లో కూర్చున్నప్పుడు సూర్యం తనతో చెప్పిన మాటలన్నీ నిజమే అన్పించాయి అవన్నీ అతని చెవుల్లో మార్మోగసాగాయి

ఆడవాళ్ళకు ఎంత స్వేచ్ఛ అవసరమో అంత వరకే ఇవ్వాలిరా!

అసలు ఆ మహిళా మండలికి చెల్లాయిని ఎందుకు పంపించావ్?

అక్కడ బ్రెయిన్ వాష్ చేసే మనుషులున్నార్రా! చెల్లాయి మనసు చెడగొడతారు వాళ్ళు మన బలహీనతలు ఆడవాళ్ళకు తెలియనివ్వ కూడదు అసలు ఆడది ఎట్టి పరిస్థితిలోను మగవాడి మాటను జవదాట కూడదు జవదాటిందంటే మగవాడికి పతనం ప్రారంభ మన్నమాటే! నీవు ఆరంభదశలో నే వున్నావు కాబట్టి చెల్లాయిని నీ మార్గంలోకి తెచ్చుకోవటం తేలిక

మంచంమ్మీద పడుకొన్నాడన్న మాటే కాని చైతన్యకు నిద్ర రావటం లేదు

మనసంతా సౌందర్య గురించే ఆలోచనలు

సౌందర్యలో ఈ మధ్య మార్పు రావటం తను గమనిస్తున్నాడు

ఆమె మాటల్లోనే కాదు చేతల్లో కూడా ఎంతో మార్పు కన్పిస్తూంది సూర్యం లాయర్ కావటం చేత ఈ విషయం తనకంటే ముందే గ్రహించాడు తన ప్రాణ స్నేహితుడు కావటం చేత రాబోయే ప్రమాదాన్ని గురించి అతను హెచ్చరిస్తున్నాడు సూర్యం చెప్పినట్టుగా తను త్వరగా మేల్కోవాలి సౌందర్యను తన మార్గం లోకి మళ్ళించుకోవాలి

వాడి సలహాలను తీసుకొని తను నడుచుకోవాలి

చైతన్య ఫోన్ దగ్గరకు వెళ్ళి సూర్యానికి రింగ్ చేశాడు

హలో అంటూ పల్కరించాడు సూర్యం

చైతన్య స్పీకింగ్! నీవన్నట్టు మీ చెల్లాయికి ఎవరో బ్రెయిన్ వాష్ చేశార్రా!

ఏమైంది?

నేను వద్దని వారించినా వినకుండా ఆ మహిళా మండలి ఫ్రెండ్సును వెంటబెట్టుకొని సెకండ్ షోకి వెళ్ళింది నీ సలహా కోసం ఫోన్ చేశాను

అయితే ఓ పని చెయ్! చెల్లాయి సన్మానుంచి వచ్చాక తలుపు తట్టితే నీవు తీయకు! ఓ చాప దుప్పటి వరండాలో పడెయ్

చలిలో వరండాలో పండుకోటం పాపం! కష్టం కదరా!

ఆ జాలి మనసే మనల్ని దద్దమ్మలను చేస్తుందిరా నాయనా! కసిగా అన్నాడు సూర్యం

ఏమోరా! ఇది ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందో నని భయంగా వుందిరా

డోంట్ వర్రీ! బర్త్ మాటను లెక్క చేయకుండా సన్మాకు వెళ్ళిన ఆడదానికి ఆ మాత్రం పనిష్మెంట్ యివ్వక తప్పదు అసలు నేనే స్వయంగా ఇప్పుడు మీ ఇంటికి వచ్చి చెల్లాయిని మందలిస్తే బాగుండేది కాని ఇక్కడ అమ్మ నాన్న వున్నారు రేపు ఉదయమే వాళ్ళను రైలెక్కించాలి నువ్వేమి బెంగపడకు నేను చెప్పినట్టు చెయ్! గుడ్ నైట్!

ఫోన్ పెట్టేసి గదిలో మూలగా వున్న చాపను తలగడను దుప్పటిని తీసుకు వెళ్ళి వరండాలో పెట్టి తలుపు గడియ వేసి మంచంమ్మీద నడుం వాల్చాడు చైతన్య

సౌందర్య సన్మా నుంచి ఎప్పుడు తిరిగి వస్తుందా అనుకొంటూ గోడగడియారం వైపు చూస్తూండి పోయాడు చైతన్య

గడియారం ఎవ్వర్నీ పట్టించుకోకుండా తన పనిని తను చేసుకుపోతూంది

పన్నెండున్నర ప్రాంతాన సౌందర్య వచ్చింది

బజ్జర్ నొక్కింది తలుపు తట్టింది ఏమండీ అంటూ ఎల్చింది

ఎంతకూ సమాధానం రాకపోయే సరికి వరండాలో వున్న లైటు వేసింది

ఓ ప్రక్కగా అమర్చి పెట్టిన చాప తలగడ దుప్పటి కన్పించాయి కోపాన్ని ఆపుకోలేక పళ్ళు పటపట కొరికింది

*　　*　　*　　*　　*

చైతన్యకు మెలకువ వచ్చేసరికి తెల్లారింది

ఉలిక్కిపడి లేచాడు

గబగబ వెళ్ళి తలుపు తీసి చూశాడు

నిద్రలో వున్న సౌందర్య కన్పించింది

ఆ పరిస్థితిలో ఆమెను చూడగానే అతని హృదయం కరగిపోయింది

ఆమెను అలా కష్ట పెట్టినందుకు తన మీద తనకే కోపం వచ్చింది వెంటనే నిద్ర లేపి క్షమాపణలు చెప్పాలను కొన్నాడు కాని అంతలోనే సూర్యం చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి తలుపు దగ్గరగా వేసి లోపలికెళ్ళి మంచంమ్మీద పండుకొన్నాడు

బాబూ! బాబూ! అన్న ఎలుపు విన్పించగానే కళ్ళు విప్పి చూశాడు చైతన్య

సౌందర్య బాబును నిద్ర లేపుతూంది

చైతన్య వైపు కొరకొరా చూసింది

సారి! సౌందర్యా! రాత్రి విపరీతమైన నిద్ర పట్టింది నీవు రావటం తలుపు కొట్టటం నాకసలు తెలీదు! అంటూ సంజాయిషి చెప్పుకొన్నాడు చైతన్య

అతని మాటలను విన్పించుకోకుండా బాబు నెత్తుకొని తన గదిలోకి వెళ్ళిపోయింది సౌందర్య

చైతన్య అచేతనంగా నిలబడిపోయాడు

రాత్రి తలుపు తీయనందుకు కోపం వచ్చిందేమో? పోనీ మారాం చేయకుండా తను కూడా సన్మాకు వెళ్ళి వుండాల్సింది ఆమెను క్షమాపణ కోరాలంటే అభిమానం అడ్డు వస్తూంది తనకు అయినా ఆడదానికి అంత మంకుపట్టు పనికిరాదు! అనుకొంటూ వరండాలోకి వచ్చాడు చైతన్య

నేను పుట్టింటికి వెళ్తున్నాను అన్న మాటలు విన్పించగానే ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూశాడు చైతన్య ఎదురుగా సౌందర్య ఓ చేతో బాబును ఎత్తుకొని మరో చేతో సూట్‌కేసు పట్టుకొని ప్రయాణానికి సిద్ధమైంది అనుకోని సంఘటన ఎదురయ్యేసరికి కంగారు పడ్డాడు చైతన్య

ఇప్పుడంత అవసరం ఏమొచ్చింది సౌందర్యా? అని అడిగాడు అందుకు సమాధానంగా వెళ్తున్నాను అనేసి గబగబ బయటకు వచ్చేసింది సౌందర్య

రోడ్డు మీద పోతున్న రిక్షా ఆపి ఎక్కి కూర్చుంది







రైల్వేస్టేషన్ రాగానే రిక్షా దిగి రిక్షా వ్యక్తికి డబ్బులిచ్చి కొడుకుతో సహా స్టేషన్లోకి అడుగు పెట్టింది తమ వూరికి టిక్కెట్టు తీసుకొంది

రైలు మరో పావు గంటలో వస్తుందని తెల్సుకొని ప్లాట్‌ఫారమ్మీద వున్న బెంచిమీద కూర్చుండి పోయింది

స్టేషన్లో అటుఇటు తిరుగుతున్న జనం వైపు చూస్తూ రైలు రాక కోసం ఎదురు చూసింది

రైలు రాగానే కొంచెం ఖాళీగా వున్నదన్పించిన కంపార్టుమెంట్లో ఎక్కి కూర్చుంది రైలు మరో అయిదు నిమిషాల్లో కదుల్తుంది అనగా హడావుడిగా ఓ ముసలాయన మామ్మగారు కంపార్టుమెంట్లోకి ప్రవేశించారు సౌందర్య ప్రక్క సీటు ఖాళీగా వుండటం చూసి ఇద్దరూ ఆమె ప్రక్కనే కూర్చుండిపోయారు

రైలు కదిలింది

సౌందర్య కిటికీలోంచి బయట కన్పిస్తున్న ప్రకృతి వైపు చూస్తూ కూర్చుంది

ఎక్కడి దాకా వెళ్ళాలమ్మా? అన్న మామ్మగారి ప్రశ్న వినగానే సౌందర్య ప్రక్కకు తిరిగి తను వెళ్ళాల్సిన వూరు చెప్పింది ముసలాయన కళ్ళజోడు పెట్టుకొని పేపరు చదవటానికి ఉపక్రమించాడు -

ఒక్కదానివే వెళ్తున్నావా? మామ్మగారు మళ్ళీ అడిగింది ఆ ప్రశ్న సౌందర్యకు చిరాకు కల్గించింది

కాదు ఇద్దరం' అంది

మరో మనిషి ఎవరు? అన్నట్టు చూసిందావిడ

'నేను మా బాబు' అంటూ మళ్ళీ కిటికీలోంచి బయటకు దృష్టి మరల్చింది సౌందర్య

సౌందర్య పెంకి సమాధానం వినేసరికి మామ్మ గారు కిక్కురుమనలేదు

చూశావటే శేషూ' పాపం ఎవరో ఆడకూతురు అటు పుట్టినింటికి ఇటు మెట్టినింటికి దూరమై ఆత్మహత్య చేసుకొందట' ముసలాయన భార్యతో చెప్తున్నాడు ఆ మాటలు వినగానే సౌందర్యకు ఒళ్ళు జలదరించింది

## ఈ సలహాలు మీ కోసమే!

పాపం! ఏమైనదట? మామ్మగారు అడిగింది

ఏముంది? ఓ అమ్మాయి మొగుడితో పోట్లాడి రెండేళ్ళ కొడుకుతో సహా పుట్టింటికి బయల్దేరింది మామకు అల్లుడికి అంతకుముందు నుంచి ఏవో తగవులున్నాయట ఇంటికొచ్చిన కూతుర్ని నానామాటలన్నాడు తండ్రి అటు మొగుడి దగ్గరకు వెళ్ళాలంటే అభిమానం అడ్డుపడింది కుర్రాడితో సహా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొందట

అయ్యో! అయ్యో! అసలీ కాలంలో ఆడపిల్లలకు రోషాలు ఎక్కువండి మా కాలంలో ఇలాగే చేశామా కాపురాలు? భర్త తిట్టినంత మాత్రానే పుట్టింటికి పారిపోయామా? అంటూ ముక్కు మీద వ్రేలేసుకొంది మామ్మగారు వాళ్ళ మాటలు వింటుంటే సౌందర్యకు ముళ్ళ మీద కూర్చున్నట్టుంది తన గురించే మాట్లాడుకొంటున్నారా అన్పించింది

ప్రతి చోటా ఇలాంటి సంఘటనలు జరుగుతూనే వున్నాయే! మొన్నటికి మొన్న మన ప్రక్క వూరిలో కూడా యిలాంటి కేసే వచ్చింది కాకపోతే ఆ అమ్మాయి రైలు కింద పడకుండా ఎల్లాడితో సహా బావిలో దూకింది ఎల్లాడు పోయాడు ఆ అమ్మాయి బ్రతికింది ఆనక అమ్మాయిని హత్య ఆత్మహత్య నేరాల క్రింద అరెస్టు చేశారు!

ముసలాయన చెప్తున్న మాటల్ని కంపార్టుమెంట్లోని వాళ్ళంతా శ్రద్ధగా ఆలకిస్తున్నారు

ఆ మాటలు వినగానే సౌందర్య హృదయం వేగంగా కొట్టుకోసాగింది రాత్రి జరిగిన సంఘటన గుర్తుకు వచ్చింది

ఇలా బయల్దేరి రావటంలో తను తొందరపడిందన్పించింది దైవసమానుడైన భర్తను తను అవమానపర్చి వచ్చింది ఆయన ఏమనుకొంటున్నారో? ఒంట్లో కూడా బాగా లేదన్నారు ఇప్పుడెలా వుందో? తను లేకపోతే ఆయన ఆలనపాలన ఎవరు చూస్తారు? సెకండ్‌షో సిన్మాకు వెళ్ళకున్నా బాగుండేది! తను తీసుకొన్న నిర్ణయం మంచిది కాదేమో? చిన్న విషయానికే అలిగి వచ్చేసిన తనను ఆయన అసహ్యించుకొంటారేమో?

చూశావుటే శేషూ' అన్న ముసలాయన మాటలు సౌందర్యఆలోచనలను చెదరగొట్టాయి

వినాలన్పించకపోయినా గంభీరమైన కంఠం కావటంతో ఆయన చెప్పే సంగతులు వినక తప్పటం లేదు

అబ్బాయి చెప్పాడు ఇప్పుడు పల్లెటూళ్ళలోనే కాదు పట్టణాల్లో కూడా ఆడపిల్లలు మొగుడి మీద అలిగి వెళ్ళిపోతున్నారట ఆమధ్య ఏదో కేసు వచ్చిందట ఇలాగే ఓ అమ్మాయి అలిగి పుట్టింటికి బయల్దేరి అర్ధరాత్రి పూట స్టేషన్లో దిగిందట ఒంటరిగా వచ్చిందన్న విషయం కనిపెట్టి ఇద్దరు రౌడీ వెధవలు ఆమెను బలాత్కరించారట

వాళ్ళ చేతులు పడిపోను వాళ్ళకదేం పోయే కాలమండి? వాళ్ళకు భార్యలు తోబుట్టువులు లేరటండి? మామ్మగారు మండిపడ్డారు

సౌందర్య ముసలాయన చెప్పే మాటలు వినలేకపోయింది ఎప్పుడు ఆ కంపార్టుమెంట్లోంచి బయటపడదామా అని ఎదురు చూడసాగింది

స్టేషన్ రాగానే రైలాగింది కొడుకును, సూట్‌కేసును తీసుకొని దిగటానికి సిద్ధమైన సౌందర్యను చూసి మామ్మగారు అదేమిటమ్మాయ్? మీ వూరింకా రాలేదుగా? ఇక్కడ దిగుతున్నావేమిటి? అని అడిగింది

నేను తిరుగు ట్రయిన్‌లో మా వారి దగ్గరకు వెళ్ళిపోతున్నాను అని రైలు దిగింది సౌందర్య

ముసలాయన మామ్మగారు ముసిముసిగా నవ్వుకొన్నారు

★ ★ ★ ★

ఫోన్ మ్రోగేసరికి హడావుడిగా పరిగెత్తాడు

చైతన్య రిసివర్ అందుకున్నాడు

హలో సూర్యాన్ని మాట్లాడుతున్నాను సారీ! చెల్లాయి అలిగి పుట్టింటికి వెళ్ళింది కదూ?

ఇదంతా నీ సలహా పాటించటం వలనే జరిగింది అయినా ఈ విషయం నీ కెలా తెల్సు? అడిగాడు చైతన్య

మార్నింగ్ అమ్మను నాన్నను రైలెక్కించటానికి స్టేషన్‌కు వెళ్ళాను అక్కడ కంపార్టుమెంట్లో కూర్చున్న చెల్లాయిని చూశాను రాత్రి జరిగిన సంఘటన కారణంగా ఆమె పుట్టింటికి ప్రయాణమైందని గ్రహించాను ఆమెకు నేను కన్పడకుండా నాన్నకు ఆమెను చూపించి కేసంతా చెప్పాను నీకు తెల్సుగా నాన్న ప్రఖ్యాత కదా రచయిత ఏదో కథ చెప్పి చెల్లాయి మనసు మార్చి నీ దగ్గరకు పంపే ఏర్పాటు చేస్తానని అదే కంపార్టుమెంట్లో కి ఎక్కారు నీ వేమి కంగారు పడకు

సౌందర్యది మొండిపట్టురా బాబూ! కథలు కాకరకాయలు ఆమెను మార్చలేవు! అన్నాడు చైతన్య దిగులుగా

అలా అనుకోటం పొరపాటు ఈ లోకంలో ప్రతి మనిషికి తొందరపాటు అనేది ఏదో పరిస్థితిలో కల్గుతూనే వుంటుంది స్వతహాగా అందరిలోను అంతర్లీనంగా వున్న అహం దెబ్బ తింటే తొందరపాటులో తాము ఏం చేస్తున్నారో కూడా




ఆలోచించరు అయితే ఆ తర్వాత ఆలోచించే అవకాశం కల్గితే తమ తొందరపాటులోని తప్పు ఒప్పులను ఎనలైజ్ చేసుకొని పశ్చాత్తాపపడ్తారు దిద్దుబాటు చేసుకోటానికి ప్రయత్నిస్తారు సరిగ్గా చెల్లాయి విషయంలోను అదే జరిగింది ఇంకా కొద్ది సేపట్లో చెల్లాయి మీ ఇంటికి రాబోతూంది

నీకెలా తెల్సు?

నాన్న ఇప్పుడే ఫోన్ చేశారు తను వాపసు వెళ్ళిపోతున్నానని చెప్పి తర్వాత స్టేషన్లో దిగిపోయిందట ట్రయిన్ వచ్చే టైమయింది రాగానే ఫోన్ చెయ్! అంటూ ఫోన్ పెట్టేశాడు సూర్యం

సూర్యం అన్నట్లుగానే మరో అరగంటకు సౌందర్య బాబుతో సహా గేటు తీసుకొని లోపలికి రావటం గమనించాడు చైతన్య ఉత్సాహం పట్టలేక సూర్యానికి ఫోన్ చేశాడు

థాంక్స్‌రా సూర్యం! మీ చెల్లాయి బాబు వచ్చేశారు నీ ఋణం ఎలా తీర్చుకోను? ఈ రోజు రాత్రికి నీవు చెల్లాయి మా ఇంటికి డిన్నర్‌కు వచ్చేయండి

వీలుపడదు అన్నాడు సూర్యం నీరసంగా

ఎందుకని? అడిగాడు చైతన్య

మీ చెల్లాయి నా మీద అలిగి పుట్టింటి కెళ్ళి ఆరురోజులైంది!

అందరికి సలహాలిచ్చే నీ విషయంలో ఇలా ఎందుకు జరిగిందిరా?

ఈ సలహాలు మీ కోసమే! అంటూ ఫోన్ పెట్టేశాడు సూర్యం □





